అన్నపూర్ణకు ఉత్తమ రైతు పురస్కారం

ప్రజాశక్తి-రాజానగరం

కోరుకొండ మండలం నిడిగట్లకు చెందిన మహిళా రైతు వేమగిరి అన్నపూర్ణకు ఉత్తమ మహిళా రైతు పురస్కారం లభించిందని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా గుంటూరులోని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విసి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి దేవి ఈ అవార్డును అన్నపూర్ణకు అందించారని తెలిపారు. అన్నపూర్ణ తూర్పు గోదావరి జిల్లాలో ప్రకతి వ్యవసాయం, వర్మీకంపోస్ట్ తయారీ, సేంద్రియ వ్యవసాయంలో శాస్త్రవేత్తల సూచనలతో నాణ్యమైన, స్థిరమైన పంట దిగుబడులు సాధించి రైతులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు.

గందరగోళంగా డిగ్రీ సెమిస్టర్

- 70 పని దినాల్లో పరీక్షలా..!
- నిబంధనలు పట్టని యంత్రాంగం
- విద్యార్థుల తీవ్ర మానసిక ఒత్తిడి

ప్రజాశక్తి - రాజోలు

కరోనా సమయంలో ఏర్పడిన డిగ్రీ సెమిస్టరు గందరగోళం నుంచి అన్ని విశ్వ విద్యాలయాలూ నెమ్మదిగా 120 రోజుల సెమిస్టరును జాగ్రత్తగా సుసాధ్యం చేసుకున్నాయి. కానీ అందుకు విరుద్ధంగా ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకు ఈ ఏడాది మార్చి 1న విడుదల చేసిన పరీక్షల సర్క్యులర్ నిదర్శనంగా ఉంది. ఏప్రిల్ 9న సెమిస్టరు పూర్తి కావాల్సి ఉండగా.. మార్చి 18 నుంచే పరీక్ష నిర్వహిస్తామని వెబ్‌సైట్‌లో ప్రొఫెసర్ డి.కల్యాణి సంతకంతో ఉంచిన సర్కులర్ విద్యార్థులను అయోమయంలో పడేసింది.

అసలు చదువుతున్నది పిల్లలా లేక యంత్రాలా?

విద్యా మనో విజ్ఞాన శాస్త్రం ప్రకారం.. యుజిసి నిబంధనలు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నియమాల ప్రకారం.. ఒక విద్యా సంవత్సరాన్ని రెండు సెమిస్టర్లుగా విభజించి.. 120 రోజుల సెమిస్టరు వ్యవధి.. తర్వాత 5 రోజులు సెషనల్స్ పరీక్షలు, తర్వాత 7 రోజులు ప్రయోగ పరీక్షలు, ఆపై 15 రోజులు థియరీ పరీక్షలు నిర్వహించాలి. అంటే 5 నెలలు సెమిస్టరుకు ఉండాలి. 120 రోజుల నిర్వహణలో సెలవులు పోగా కనీసం 90 రోజులు పని దినాలు ఉండాలి అనే నిబంధన ఉంది. ఈ విధానాన్ని రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలూ పాటిస్తుంటే కేవలం రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం అధికారులు మాత్రం.. నిబంధనలను తొంగలోకి తొక్కేస్తున్నారు. అసలు చదివేది విద్యార్థులు అనే విషయాన్ని మర్చిపోయి.. వారి స్థానంలో యంత్రాలు విద్యనభ్యసిస్తున్నాయనే అపోహలో ఉన్నట్టున్నారు.

సింగిల్ మేజర్‌తో మరింత జఠిలం!

ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం పరిధిలో గత కొన్ని విద్యా సంవత్సరాల నుంచి డిగ్రీ సెమిస్టరు విధానంలో.. ఒక్క సెమిస్టరుకు కూడా సక్రమమైన రీతిలో తరగతులు పూర్తిగా జరగకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్క సెమిస్టరులో సెలవు దినాలన్నిటిని తీసివేయగా 90 రోజులు వర్కింగ్ డేస్ జరగాలనే నిబంధనలు పట్టించుకోకుండా పరీక్షల టైమ్ టేబుల్ ఇస్తున్నారు. ఈ పరిస్థితి సింగిల్ మేజర్ విధానం వచ్చిన తర్వాత మరింత అగమ్యగోచరంగా మారింది. సింగిల్ మేజర్ వల్ల అన్నీ పేపర్లు ఒకే సబ్జెక్టు వల్ల.. పైగా బాగా ఎక్కువ సిలబస్ వల్ల ఊపిరి పీల్చుకునే టైమ్ కూడా విద్యార్థులకు ఉండటం లేదు. అందువల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికికి లోనవుతున్నారు.

ఇదో వింతైన పోకడ!

మార్చి 18 నుంచి ప్రయోగ పరీక్షలు, 24 నుంచి థియరీ పరీక్షలు అని మార్చి1 న వెబ్‌సైట్‌లో ఉంచిన సర్కులర్ పైన.. ఆ సర్కులర్ ఫిబ్రవరి 25 న విడుదల చేసినట్టు ఉంది. ఇలాంటి వింత పోకడలు ఆదికవి విశ్వ విద్యాలయంలోనే ఎదురవుతుంటాయి.

కేవలం 70 రోజుల్లోనే పరీక్షలా!

ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం థర్డ్ సెమిస్టరు డిగ్రీ పరీక్షలు 2024 డిసెంబర్ 4న పూర్తయ్యాయి. 9.12.2024 ఉనుంచి నాలుగో సెమిస్టరు అకడమిక్ క్యాలెండర్‌లో తరగతులు ప్రారంభం అని ఇచ్చారు. అప్పటి నుంచి లెక్క కడితే ఏప్రిల్ 9 నాటికి 120 రోజుల సెమిస్టరు, 90 రోజుల పని దినాలు పూర్తవుతాయి. 2024 డిసెంబర్ 9 నుంచి అంటే 31 వరకూ 23 రోజులు. వీటిలో యూనివర్సిటీ ఇచ్చిన క్రిస్మస్ పండుగకు మూడు రోజులు, 3 ఆదివారాలు, ఒక రెండో శనివారం తీసివేయగా.. 16 రోజులు పని దినాలు.! 2025 జనవరి నెలలో మొత్తం 31 రోజుల్లో.. యూనివర్సిటీ ప్రకటించిన సంక్రాంతి పండుగకు 7 రోజులు, 3 ఆదివారాలు, రిపబ్లిక్ డేతో కలిపి 11 సెలవులు పోగా.. కేవలం 20 రోజులు మాత్రమే తరగతులు జరిగాయి. ఇక ఫిబ్రవరిలో 28 రోజుల్లో.. 4 ఆదివారాలు, రెండో శనివారం, మహా శివరాత్రి, ఎన్నికలు కలిపి సెలవులు తీసేస్తే 21 రోజులు మాత్రమే పని దినాలు. ఇక మార్చి వచ్చింది. యూనివర్సిటీ ప్రకటించిన పరీక్షల షెడ్యూల్ ప్రకారం 18 నుంచి అయితే మొత్తం18 రోజుల్లో 3 ఆదివారాలు, రెండో శనివారం, హోలీ సెలవులు పోగా కేవలం 14 రోజులు మాత్రమే తరగతులు జరుగుతాయి. అంటే ఈ నాలుగో సెమిస్టర్‌లో పని దినాలను కలుపుకొని లెక్కిస్తే కేవలం 70 రోజులు మాత్రమే పూర్తి అయ్యాయి. మరో 20 రోజులు ఎక్కడికి వెళ్లాయి. అంటే యూనివర్సిటీ అధికారుల దృష్టిలో 70 రోజులు అంటే 90 రోజులని అర్థమా.. 90 రోజులు పూర్తి కాకుండానే విరుద్ధంగా మార్చి 18 నుంచి పరీక్షలు ఇవ్వడం వెనుక అంతరార్థం ఏమిటో మన యూనివర్సిటీ అధికారులకే తెలియాలి.

యాజమాన్యాల చోద్యం

ఈ సమస్యపై కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోకపోవడం దారుణం. ఎక్కువ కళాశాలల్లో విద్యార్థులకు సరైన విషయ విశ్లేషణ ఇవ్వకుండా బజారులో దొరికే టెస్ట్ పేపర్స్ ఇచ్చేసి సిలబస్‌ను మమ అనిపించేస్తున్నారు. యాజమాన్యం ఎంత త్వరగా పరీక్షలు అయిపోతే అంత మంచిది అని ఆలోచన చేయడం వెనుక అంతర్యం యూనివర్సిటీ అధికారులు గమనించి విద్యార్థుల మానసిక ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. త్వరగా పరీక్షలు పూర్తి అయితే స్టాఫ్ నిలుపుదల చేస్తే జీతాలు కలిసి వస్తాయని కొన్ని యాజమాన్యాలు, విద్యార్థుల ప్రవేశాలకు తిప్పుకోవచ్చునని మరికొన్ని యాజమాన్యాలు ఆలోచిస్తున్నాయి. గతంలోనూ ప్రస్తుతం కూడా యాజమాన్యాలు విద్యార్థులకు ఇబ్బంది ఎదురైతే పట్టించుకోరు. కానీ వాళ్ళకి రావాల్సిన డబ్బులు రాకపోతే మాత్రం మరుక్షణంలో యూనివర్సిటీకి వినతి పత్రాలుపై వినతి పత్రాలు అందజేస్తారు. ఇవన్నీ దష్టిలో ఉంచుకుని విద్యార్థులకు న్యాయం చేసి డిగ్రీ విద్య మనుగడ కాపాడాలని పలువురు విద్యావేత్తలు, విద్యార్థులు కోరుతున్నారు.

ఆశలన్నీ విసి పైనే..

ఇలాంటి విరుద్ధ నిర్ణయాలకు చెక్ పెట్టి.. పూర్తి ప్రక్షాళన చేసి.. యూనివర్సిటీని గాడిలో పెడతారని ఇటీవల విసిగా వచ్చిన ఎస్.ప్రసన్నశ్రీపై విద్యావేత్తలు ఆశలు పెట్టుకున్నారు. ఆమె విద్యార్థుల సమస్యలను క్షేత్ర స్థాయిలోంచి విశ్లేషణ చేస్తారనే నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే విద్యార్థులు తమకు న్యాయం చేసి ఏప్రిల్ 9 తర్వాత ప్రయోగ పరీక్షలు, ఏప్రిల్ 16 నుంచి థియరీ పరీక్షలు నిర్వహిస్తారని ఎదురు చూస్తున్నారు.

పక్క యూనివర్సిటీల్లో పక్కా ప్రణాళిక

విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ
తరగతులు ప్రారంభం: 25-11-2024
పరీక్షలు పెట్టబోయే తేదీ : 19-4-2025 టెంటేటివ్

తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ
తరగతులు ప్రారంభం: 15-1-2025
పరీక్షలు పెట్టబోయే తేదీ: 24-5-2025 టెంటేటివ్

గుంటూరు నాగార్జున యూనివర్సిటీ
తరగతులు ప్రారంభం: 11-11-2024
పరీక్షలు పెట్టబోయే తేదీ: 25-3-2025

మహిళా దినోత్సవంపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై క్షేత్ర స్థాయి అధికారులతో స్థానిక కలక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిఆర్‌డిఎ, మెప్మా ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామిక వేత్తలతో విజయగాథలు, ఆర్థిక చేకూర్పు కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, భద్రతా ప్రమాణాలు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం వంటి వాటితో సహా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల కేంద్రంలో వేడుకలు స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుని వెళ్లడం ముఖ్యం అన్నారు. ఈ వేడుకల్లో ప్రతిభ కనబరిచిన, ఉత్తమ మహిళలను ఆయా వేడుకలు నిర్వహించే వేదికలపై సన్మానించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ కుమారి, డిఆర్‌డిఎ పీడ ఎన్‌విఎస్ మూర్తి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ఆశావర్కర్ల అక్రమ నిర్బంధం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం, దేవరపల్లి

చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ బయలుదేరిన ఆశ వర్కర్లపై పోలీసులు గురువారం నిర్బంధం ప్రయోగించారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో సుమారు 20 మంది ఆశ వర్కర్లను అదుపులోకి తీసుకుని వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ లకు ఉదయం 6 గంటలకు తరలించారు. అనంతరం ఒక గంట తర్వాత విడుదల చేశారు. పోలీసులు నిర్బంధాన్ని సైతం అధిగమించి ఆశ వర్కర్లు విజయవాడ చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు

దేవరపల్లి ఆశా వర్కర్ల చలో విజయవాడ కార్యక్రమంపై ప్రభుత్వం నిర్బంధం విధించడాన్ని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ ఖండించారు. గురువారం చలో విజయవాడకు వెళుతున్న ఆశా వర్కర్లను అక్రమంగా నిర్బంధించిన దేవరపల్లి పోలీస్ స్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. భగత్ మాట్లాడుతూ న్యాయమైన కోర్కెల కోసం చలో విజయవాడ వెళ్తున్న వర్కర్లను దౌర్జన్యంగా బెదిరించి వాహనాల నుంచి దింపి వేయడం దారుణం అన్నారు. స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించడం ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ పద్ధతులను ఉద్యమాల విషయంలో అనుసరిస్తోందన్నారు. అనంతరం నిర్బంధంలోకి తీసుకున్న వారిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ, ఆశా యూనియన్ నాయకులు తొర్లపాటి ఇందిర, టి.మోదమ్మ, ఎ.ప్రసన్న, కె.సత్యవతి, ఆర్.భారతి పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సమాజంలో మార్పే కమ్యూనిస్ట్ పార్టీ లక్ష్యం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సమాజంలో మార్పు తీసుకు వచ్చేందుకు కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తోందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎంసి వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఐ జిల్లా కార్యకర్తల వర్క్‌షాప్‌లో గురువారం ఆయన మాట్లాడారు. మూడు రోజుల శిక్షణా తరగతుల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం కులం, వర్గ, సామాజిక న్యాయం అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఈ వర్క్‌షాపులో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనిజ హాజరయ్యారు. సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు శిక్షణా తరగతులను పర్యవేక్షించారు. ఈ క్లాస్‌కు ప్రజానాట్య మండలి అధ్యక్షులు ముప్పన కుమార్ అధ్యక్షత వహించారు. చలసాని రామారావు, జివి.రామారావు, ప్రొఫెసర్ కె.రాజశేఖర్ మాట్లాడారు.

హెచ్‌ఆర్ పాలసీపై నిరసన

ప్రజాశక్తి-చాగల్లు

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, జీతాలు పెంచాలని, ఉద్యోగ విరమణ అనంతరం గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద చాగల్లు మండల సమగ్రశిక్ష ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీర వెంకటరావు, కంప్యూటర్ ఆపరేటర్ గణేష్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ గీత భవానీ, సిఆర్‌పిలు రాజేష్, సంధ్య, స్వరూప, పిటిఐ వల్లి, మెసెంజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నన్నయలో ముగిసిన నారీ ఫెస్ట్

నారీ ఫెస్ట్‌కు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్ విసి

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న నారీ ఫెస్ట్ గురువారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, కలెక్టర్ పి.ప్రశాంతి, డాక్టర్ పద్మ, కేంద్ర కారాగారం డిఎస్‌పి వసంత కుమారి, ఉమెన్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ఉమమహేశ్వరిదేవి హాజరయ్యారు. అనంతరం సభలో విసి ప్రసన్నశ్రీ మాట్లాడుతూ నారీ ఫెస్ట్ 2025, అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు ఎంతో విజయవంతంగా జరిగాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సజనాత్మక హస్తకళలు, పుష్పాలంకరణ, హెల్తీ బేబీ, మామ్మ మనవరాలు వంటి కార్యక్రమాలకు మహిళల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఇది లింగ సమానత్వం వైపు వేగంగా, మరింత ప్రభావవంతంగా ముందుకు సాగవలసిన ఆవశ్యకత ఉందన్నారు. విభజనలతో సంబంధం లేకుండా వివిధ రంగాలలో మహిళల సహకారాన్ని గుర్తించడానికి, ప్రపంచవ్యాప్తంగా మహిళల హక్కుల కోసం వాదిస్తూ సాధికారతను ప్రోత్సహించడానికి మహిళా దినోత్సవాన్ని ఏటా జరుపుకుంటున్నామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయానికి మహిళా విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాన హక్కుల కోసం పోరాడుతున్న క్రమంలో తోటి మహిళల పట్ల మనం ఏ విధంగా వ్యవహరిస్తున్నామనే అంశాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సమానత్వపు హక్కును అలవాటు చేసుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుగు సాగడం అలవర్చుకోవాలని సూచించారు. తరువాత అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, డాక్టర్ పద్మ, తహశీల్దారు జి.సత్య అనంత లక్ష్మి దేవి, పిల్లల వైద్యురాలు ఇంద్రజ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర రాంబాబు కృషి అభినందనీయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం కేంద్రంగా గత 27 సంవత్సరాలుగా వృద్ధులు, అనాథలు, నిరాశ్రయుల సంక్షేమం కోసం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకులు లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు కృషి అభినందనీయమని ఇన్నర్ వీల్ క్లబ్ పూర్వపు జిల్లా ఛైర్మన్ పి.లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక లాలాచెరువులో గల స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అంతర్జాతీయ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో రాంబాబుకు డొక్కా సీతమ్మ నిత్య అన్నదాన అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదానం ఐక్యరాజ్యసమితి సూచించిన అంతర్జాతీయ సేవా కార్యక్రమాల్లో అతి ముఖ్యమైనదని అన్నారు. నిరాశ్రయులు అవసరార్థుల కోసం నిత్యాన్నదానం అందిస్తున్న స్వర్ణాంధ్ర రాంబాబుకు అవార్డును అందజేయడం సముచితంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు రాంబాబును సత్కరించి అవార్డు, జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఉచిత అన్నదాన సేవలకు సహకరిస్తున్న దాతలకు స్వర్ణాంధ్ర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా కోశాధికారి సౌందర్య, కార్యదర్శి తులసి లక్ష్మి, విశ్రాంత పశుసంవర్ధక వైద్య అధికారి మాటూరి రామకోటేశ్వరరావు, ఎస్‌వివి.సత్యనారాయణ, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు, స్వర్ణాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర రాంబాబును సత్కరిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

విజెఎస్‌లో ఘనంగా నేషనల్ ఫార్మసీ డే

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దివాన్ చెరువులోని విజెఎస్ ఫార్మసీ కళాశాలలో నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్ర మాట్లాడారు. ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్‌ని ఫాదర్ ఆఫ్ ఫార్మసీ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియాగా గుర్తించారని, ఈయన ఫార్మసీరంగంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించారన్నారు. ఆయన జయంతిని నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డేగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటించిందన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వివి.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ మహదేవ్‌లాల్‌ష్రాఫ్ వంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఎపిటిఐ ఎపి స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ 1966లో ఎపిటిఐ తొలి ప్రెసిడెంట్‌గా పని చేశారన్నారు. గవర్నమెంట్ ఫండ్స్ ఫార్మసీ వృత్తిలో స్టార్టప్స్ కోసం సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. క్లైనాక్సీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ, ఫౌండర్ డాక్టర్ బి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో వివిధ రకాల అవకాశాలున్నాయన్నారు. కెరియర్ డెవలప్ చేసుకోడానికి డ్రగ్ డెవలప్‌మెంట్ జర్నీ, క్లినికల్ రిసోర్స్ వంటి పద్ధతులను వివరించారు. ఆర్‌వి ల్యాబ్ఐస డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఫార్మా, ఫార్మసీ ప్రాక్టీస్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌లు ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్, ఫార్మాస్యూటికల్ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజెఎస్‌లో నేషనల్ ఫార్మసీ డేలో పాల్గొన్న అధ్యాపక విద్యార్థుల బృందం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

200 మంది మహిళలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక ప్రభుత్వ బోధనా ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఈ పరీక్షలను ప్రారంభించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా సన్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో జిజిహెచ్‌లో ఉచితంగా 200 మంది మహిళలకు బోన్స్ డెన్సిటీ టెస్ట్, నెఫ్రో ప్లస్ క్రియాటివ్ రక్త పరీక్షలు చేసినట్టు తెలిపారు. మహిళలు ఇళ్లల్లో అధికంగా శ్రమ పడుతుంటారని, వారి కుటుంబం ఆరోగ్యం కోసం ఆలోచనలో ఉన్న శ్రద్ధ వారి ఆరోగ్య విషయంలో చూపరని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీ సూర్య ప్రభ మాట్లాడుతూ సన్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ఉచితంగా ఎముకుల పటుత్వ, కిడ్నీ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, హాస్పిటల్స్ డిసిహెచ్‌ఎస్ఇ పద్మశ్రీరాణి, సన్ ఫార్మా మేనేజర్స్ ఎ.ఆనంద్ బాబు, వి.నాగగణేష్, ఎగ్జిక్యూటివ్ వి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండలంలోని మలకపల్లి పంట పొలాల్లో రైతులు వాడిన పిఆర్ 126 వరి విత్తనంపై వచ్చిన ఫిర్యాదు మేరకు పంటను పరిశీలించినట్టు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. మలకపల్లి పరిసరాల్లో దాళ్వా వరి పంట పరిస్థితి, రకాలు, చీడపీడల ఉధతిని పరిశీలించేందుకు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు అధికారులు గురువారం మలకపల్లి గ్రామానికి వచ్చి పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించి నివేదిక సమర్పిస్తామని అన్నారు. దాళ్వా వరి పంట ప్రస్తుతం పాలు పోసుకునే దశ నుండి గింజ గట్టిపడే దశలో ఉందని, అన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.సుధారాణి, డాక్టర్ బి.రోజా, వ్యవసాయ శాఖ కొవ్వూరు ఎడిఎ పి.చంద్రశేఖరరావు, ఎడిఎ ఎస్.జయ రామలక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి రుచిత పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 30 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-చాగల్లు, తాళ్లపూడి

చాగల్లు శ్రీవెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 13 మంది విద్యార్థులు పరీక్షలు గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.పావని తెలిపారు. 145 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరైనట్టు తెలిపారు.

తాళ్లపూడిలో ఇంటర్ పరీక్షలకు 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎగ్జామ్ చీఫ్ గౌరీ నాథ్ తెలిపారు. వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 306 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 289 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని చీఫ్ తెలిపారు.

కార్మికులకు రక్షణ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు రక్షణ పరికరములు తప్పనిసరిగా వాడాలని కమిషనరు కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం సంస్థ కార్యాలయంలో కార్మికులకు రక్షణ పరికరాలు పంపిణీ చేశారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ బృందాలు ప్రతి రోజు డిగ్రీ కాలేజీలను సందర్శిస్తాయని తెలిపారురు. శానిటరీ సూపర్వైజర్ ఐ.శ్రీనివాస్, రామలింగారెడ్డి, సయ్యద్ ఖాసిం పాల్గొన్నారు.

వెంకన్నకు రూ.4.11 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-పెరవలి

అన్నవరప్పాడులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం వేలివెన్ను గ్రూపు దేవాలయాల ఇఒ పివి. సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 43 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.4,03,875, అన్నదానం హుండీ ద్వారా రూ.8,104, మొత్తం రూ.4,11,979 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం సెక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం, సత్యవాడ, మోర్త, చిలకపాడు, దమ్మెన్ను ప్రజలు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధి శివరామ్‌పట్నంలో సుమారు 36 ఎకరాల భూమిని భూమి లేని నిరుపేదలు 20 ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్నారు. ఆ భూములకు పట్టాలు మంజూరు చేయాలని గురువారం తహశీల్దారు సాయి ప్రసాద్‌కు ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రంతో పాటు సాగుదారుల పేర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమి కోసం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక ర్యాలీలు, రాస్తారోకోలు, నిరసనలు నిర్వహించామని తెలిపారు. అదే క్రమంలో అక్రమ కేసులు, నిర్బంధాలు భరించామని తెలిపారు. అయినా గాని ఎన్ని ప్రభుత్వాలు మారిన సాగు చేసుకుంటున్నా నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయడం లేదని తెలిపారు. సాగుదారులకి పట్టాలు మంజూరు చేస్తే వారు ఆర్థికంగా బలపడడానికి తోడ్పడినట్టు అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సతీష్, నాయకులు కర్ణాకుల రామలింగేశ్వరరావు, దేసెట్టి సురేష్, జాన్, అర్జున్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని పల్లి పాలెం గ్రామ శివారు కాలా వారి పేటకు చెందిన జిత్తుగ భవాని ఏలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం...జిత్తుగ అప్పారావు, భవానీ దంపతులు జీవనోపాధి కోసం కొంత కాలం క్రితం హైదరబాద్ వెళ్లారు. భర్త సెక్యూరిటీగా పని చేస్తూ విద్యుత్తు మరమ్మతులు చేస్తుండగా భార్య పలువురి ఇంటి వద్ద పని చేస్తుందన్నారు. ఈ క్రమంలో బంధువుల వివాహం నిమిత్తం కాకినాడ వస్తుండుగా గురువారం తెల్లవారుజామున ఏలూరు వద్ద ఈమె ఎక్కిన ప్రయివేట్ ట్రావెల్ బస్సు సిమెంట్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భవానీ మృతి చెందారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు ఇంజనీరింగ్ చేస్తున్నాడు. చిన్న కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పొగాకు గొడౌన్‌లో మంటలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామేపాలెం గ్రామానికి చెందిన రైతు మైలవరపు పెద్దకాపుకి చెందిన పొగాకు గొడౌన్ ప్రమాదవశాత్తు దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రాంతానికి వచ్చేటప్పటికే పూర్తిగా దగ్ధం అయింది. జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించాలని స్థానికులు కోరారు.

పొగాకు బేరన్ దగ్ధం

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రమాదవశాత్తు పొగాకు బేరన్‌లో మంటలు చెలరేగి సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని జంగారెడ్డిగూడెం ఫైర్ స్టేషన్ అధికారి జి.అబ్రహం తెలిపారు. గురువారం వాదాలకుంటలో గడ కుమారికి చెందిన పొగాకు బ్యారన్ దగ్ధమయ్యింది. స్థానిక రైతులు బేరన్ నిప్పు అంటుకోవడంతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో హుటాహుటిన జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గోపాలపురం

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కర్రి సతీష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్లను కలిగి ఉండాలని తమను తాము కాపాడుకునే విధానంపై గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అంబేద్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. నూతన చట్టాలు వాటి ఆవశ్యకతపై మహిళా కానిస్టేబుల్ రాపాక బాల కుమారి విద్యార్థులకు వివరించారు.

2 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వెలగదుర్రులో కాపుల రామాలయం ఏడో వార్షికోత్సవం నేపథ్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. వెలగదుర్రుతో పాటు సరిహద్దు గ్రామాలు మోర్త, తాడిపర్రు నుంచి సుమారు 2000 మంది ఈ అన్నదానంలో పాల్గొన్నారు. దాసరి వెంకన్న, యాతం ఏసు, యాతం ఆనందరాజు, పిండి అచ్చియ్య, దొడ్డా వెంకన్న పాల్గొన్నారు.

సాగునీరు తోడితే చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

శివారు పంట పొలాలకు సాగునీరు అందకుండా అక్రమ పైపులు, మోటార్ల ద్వారా సాగునీరు తరలించే వారిపై చర్యలు తప్పవని ఆర్‌డిఒ ఎస్. మల్లిబాబు హెచ్చరించారు. ఇటీవల అక్రమంగా నీరు తరలిస్తున్న పైపులను తొలగిస్తున్న సందర్భంగా ఇరిగేషన్ అధికారులపై కొందరు రైతులు దురుసుగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో గురువారం మత్స్యశాఖ అధికారి కరుణాకర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులతో కలిసి ఆయన నీలపల్లి, పి.మల్లవరం పంట కాలువలను పరిశీలించారు. డివైడింగ్ డామ్ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన 12 పైపులను అధికారులు తొలగించారు. శివారు ప్రాంతాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆర్‌డిఒ అన్నారు. వంతుల వారీ పద్ధతిలో దిగువకు నీరు వెళ్లేలా పైన రైతులు సహకరించాలన్నారు. అక్రమంగా ఎటువంటి పైపులు వేసిన వాటిని తొలగించి కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.త్రినాథరావు, సిఐ చైతన్యకృష్ణ, ఇరిగేషన్ ఎఇ అనూష, డిసి ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, నీటి సంఘాల అధ్యక్షులు అల్లూరి రామకృష్ణంరాజు, ఉంగరాల గోపి, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వెట్లపాలెం, పెద్దాపురం మండలం ఆర్‌బి.పట్టణం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రూరల్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతున్నట్టు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేట్లపాలెం రైల్వే ఏరియా, హుస్సేన్‌పురం రూరల్ ఫీడెర్స్, వ్యవసాయ ఏరియా, ఆర్‌బి.పట్నం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పన్నులు త్వరగా వసూలు చేయాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలో దీర్ఘకాలికంగా బకాయపడిన పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని డిఎల్‌పిఒ బాలమణి అధికారులను ఆదేశించారు. గురువారం జగపతినగరం, ముక్కొల్లు గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామాలలో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణను విధిగా చేపట్టాలని అన్నారు. ఆ చెత్తను చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. దానిని ఎరువుగా తయారుచేసి రైతులకు అందించేందుకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎన్‌టిఆర్.రమేష్‌బాబు, కె.సరళాదేవి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న రాజీవ్ కృష్ణ

చేతికి అంది వచ్చిన కొడుకులు ఉన్నత స్థాయిలోకి వెళ్లి తమకి ఆసరాగా ఉంటారనుకున్న సమయంలో మత్యువాత పడటం ఆ కుటుంబాలకు ఎవరు తీర్చలేని బాధ అని టిడిపి సీనియర్ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త రాజీవ్ కృష్ణ అన్నారు. మండలంలోని తాడిపూడిలో ఇటీవల మృతి చెందిన ఐదుగురు యువకుల కుటుంబాలను పరామర్శించడానికి రాజీవ్ కృష్ణ గురువారం గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో ఆ కుటుంబాలకి అన్నివేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. రాజీవ్ కృష్ణ వెంట గ్రామ సర్పంచ్ నామా గోపాలం, చాగల్లు జెడ్‌పిటిసి గారపాటి శ్రీనివాస్, తాళ్లపూడి మండల నాయకులు ఎన్.సురేంద్ర, ఎస్.రాధాకృష్ణ, టి.సత్యనారాయణ, కె.వెంకన్న బాబు, పెద్దబ్బులు, ఐ.వీర శంకరం, వీరభద్రం తదితరులు ఉన్నారు.

ఘనంగా డ్రీమ్స్ స్కూల్ క్రీడా ఉత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పతకాలు అందజేస్తున్న సిఐ టి.గణేష్

విద్యార్థులు విద్యతోపాటు అన్నింటా ముందుండాలని ధవళేశ్వరం సిఐ టి.గణేష్ పేర్కొన్నారు. ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ ఆవరణలో గురువారం డ్రీమ్స్ క్రీడోత్సవ్-2025 బహుమతుల ప్రదానోత్సంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడలతో ఒత్తిడి దూరం అవుతుందన్నారు. గ్రామీణ వాతావరణంలో కార్పొరేట్‌కు దీటుగా సాధారణ ఫీజులకే విద్యను అందిస్తూ డ్రీమ్స్ అన్నింటా అగ్రస్థానానికి చేరుకోవడం అభినందనీయమన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని వివరించారు. అన్నింటా రాణించి గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యతోపాటు క్రీడలకు ప్రాముఖ్యత ఇస్తున్న డ్రీమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం డ్రీమ్స్ క్రీడోత్సవ్-2025లో క్రికెట్, రన్నింగ్, త్రోబాల్, కబడ్డీ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్, కరస్పాండెంట్ అంగర రమేష్, ప్రిన్సిపల్స్ వి.సంధ్యా కుమారి, జి.విమలారోజి, ఎన్.దీపిక, కె.లలితా దేవి పాల్గొన్నారు.

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-కడియం

నానిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, అందరూ ఉత్తీర్ణులై పాఠశాలకి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామ ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. నెల రోజులుగా పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట అల్పాహారం ఏర్పాటు చేసి ప్రోత్సహించిన ఉప సర్పంచ్‌ను పదో తరగతి విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, రఫీయుద్దీన్ సువర్ణవేణి, అక్షయమ్మ, పద్మశ్రీ పాల్గొన్నారు.

పి4 సర్వే సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-తాళ్లపూడి

పి 4 సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎంపిడిఒ రమణ

ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామి (పి4) సర్వే వివాదాలకు అవకాశం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తాళ్లపూడి ఎంపిడిఒ రమణ సూచించారు. ఈ సర్వే కోసం నియమితులైన సిబ్బందికి తాళ్లపూడి ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త సర్వే అనంతరం ఉగాది రోజున ఈ సర్వేకి సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని, అందువల్ల ఈ నెల 18వ తేదీలోగా ఈ సర్వే పూర్తి చేయవలసి ఉందని, సచివాలయ సిబ్బంది మొత్తం దీనిపై దష్టి సారించాలని సూచించారు. ఈ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సర్వే ఆధారంగా పేదవారిలో నిరుపేదలతోపాటు, ధనికుల సర్వే కూడా ఉందన్నారు.

సిహెచ్ఒ సునీతకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని పెద్దాడ పిహెచ్‌సి పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిహెచ్ఒ పాలకుర్తి సునీతకు న్యాయం చేయాలని సిహెచ్ఒ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గురువారం పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సిహెచ్ఒ సునీతపై వైద్యులు డాక్టర్ సురేఖ, డాక్టర్ ప్రత్యూష, సూపర్‌వైజర్ శారదమ్మ పని ఒత్తిడి పెంచి వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ వేధింపులు తాళలేకే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. గత ప్రభుత్వం నుంచి ఎంఎల్‌హెచ్‌పిలు పని ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు దఫాలుగా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు వివరించినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. సిహెచ్ఒ సునీత ఆత్మహత్యాయత్నానికి కారకులైన వైద్యులు, సూపర్‌వైజర్‌లను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎపి సిహెచ్ఒ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మధు, సుధాకర్, ఐ వెంకటేష్, జనరల్ సెక్రెటరీ నరేష్ ఉపేంద్ర రాజ్, రాష్ట్ర కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

'మహిళలకు రక్షణ కల్పించాలి'

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పని ప్రదేశంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పద్మావతి అన్నారు. గురువారం స్థానిక మెయిన్ రోడ్‌లో గల ప్రాథమిక పాఠశాలలో సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు ఓరుగంటి నందీశ్వరుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా నేటికీ మహిళలు, బాలికలపై వివక్షత, అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నా వాటిని అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలని, మహిళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు మరింతగా చైతన్యం పొందాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న దారుణాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.చిన్న, జెవివి సమత జిల్లా కన్వీనర్ సిహెచ్‌యుఆర్. మంగతాయారు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సీతారామరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, జెవివి మండల గౌరవ అధ్యక్షులు దాడి పద్మనాభం, అంగన్‌వాడీ పిఠాపురం ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి తులసిదేవి, వెన్నా వెంకటలక్ష్మి, ఇతర అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంపై పీడీ ఆగ్రహం

ప్రజాశక్తి - తుని

పర్యావరణ పరిరక్షణ కోసం ఉపాధి హామీ పథకంలో నాటిని మొక్కలను సంరక్షించడంలో విఫలం అయిన ఉపాధి హామీ సిబ్బందిపై డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 2023-24 సంవత్సరంలో గ్రామీణ ఉపాధి పథకంలో జరిగిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ ప్రగతి ప్రజావేదిక కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ ఏడాదిలో 1442 పనులు నిర్వహించగా రూ.14,96,71,010 నిధులను ఖర్చు చేశారు. గ్రామీణ ఉపాధి పథకం ద్వారా చెరువు పనులు పూడికతీతలో పంట కాలువల్లో పూడికతీతలు, ఇతర పనులు నిర్వహించారు. మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షించాలని లక్ష్యంతో మొక్కల పెంచడానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ మొక్కలను పెంచడంలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రభుత్వం ఆశించిన రీతిలో వాటిని పెంచకపోవడంపై ఉపాధి సిబ్బంది నిలదీశారు. ఉపాధి కూలీలకు మచ్చులు, సంతకాలు లేకుండానే వేతనాలు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. సామాజిక తనిఖీల్లో బయటపడిన అవకతవకలపై రూ.87 వేలను రికవరీ చేయాలని పీడీ వెంకటలక్ష్మి ఆదేశించారు. ఎపిడి జగదాంబ, ఎస్ఆర్‌పి సింహాద్రి, డిఆర్‌పి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

చర్చిల అనుమతులపై విచారణ హేయం

ప్రజాశక్తి - నిడదవోలు

క్రైస్తవ చర్చిల అనుమతులపై విచారణ అత్యంత హేయమైన చర్య అని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు ఖండించారు. క్రైస్తవుల మనోభావాలను దెబ్బ తీసే ఈ వివక్ష పూరితమైన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రాంబాబు డిమాండ్ చేశారు. రాంబాబు మాట్లాడుతూ గత ఫిబ్రవరి10న పంచాయతీరాజ్ అభివృద్ధి కమిషనర్ 26 జిల్లాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న క్రైస్తవ చర్చిలన్నింటినీ పరిశీలించాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారని తెలిపారు. ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

8న మాల ఉద్యోగుల ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఈ నెల 8న జిల్లా మాల ఉద్యోగుల ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎపి మాల ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ ఎల్‌వి.ప్రసాదరావు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్‌వి.ప్రసాద్ మాట్లాడారు. రిజర్వేషన్ల అంశంలో మాలలందరినీ రాష్ట్రవ్యాప్తంగా ఐక్యం చేయడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తాళ్లూరి బాబూరాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, అర్దాల కుమార్ బాబు, పి.బాబూరావు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-కడియం

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల ద్వారా ఇంటింటి తడి, పొడి చెత్త సేకరణకు సంబంధించి ముమ్మర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి తెలిపారు. గురువారం ఆమె డిఎల్‌పిఒ ఎం.నాగలతతో కలిసి మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, మురమండ, దుళ్ల, వీరవరం, కడియపుసావరంలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరణకు సంబంధించి నిర్వహిస్తున్న ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్‌వి.రామ్‌ప్రసాద్, కార్యదర్శులు రూప్‌చంద్, ఎ.శ్రీనివాసరావు, శ్రీనివాస్ రెడ్డి, ఆర్.సత్యనారాయణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలపై రైతుల మొర

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని శివారు ప్రాంతాల్లోని పలువురు రైతులు సాగునీటి కష్టాలపై ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాగునీరు అందని శివారు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు ప్రాంతంలోని 9వ నెంబరు పైపు చిన్న తూరతిప్ప, 11 నెంబరు పెదమాడి కాపు పైపులైను పైన, మెయిన్ కాలువ, కొత్త కాలువ, చిన్న డాక్టర్ కాలువ, ఎంఎస్ఎన్ చార్టీస్ తదితర ప్రాంతాల్లో మొత్తం 670 ఎకరాలకు సాగునీరు పూర్తిగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గంజా శ్రీను, పితాని సత్యనారాయణ, మేడిశెట్టి సత్యనారాయణ, గెద్దాడ భగవాన్, వాసంశెట్టి రాము, దొమ్మేటి శివకుమార్, వెంకటేశ్వర రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

8 నుంచి పి4 సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఈనెల 8వ తేదీ నుంచి పి-4 సర్వేను ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి ఆ ఇంటిలో నివసిస్తున్న వారి మౌలిక వసతులు, ఆర్థిక ప్రమాణాలు, పేదరికం గుర్తిస్తారన్నారు. గుర్తించిన 20 శాతం పేద కుటుంబాలను వారి ఆర్థిక, సామాజిక, స్థితిగతులు ఏడాదికి 15 శాతం పెంచేందుకు ఈ సర్వే నిర్వహించబడుతుందన్నారు. ఈ సర్వే నిర్వహించేందుకు 27 రకాల ప్రశ్నలతో గ్రామ సచివాలయాల ద్వారా సర్వే నిర్వహిస్తామని చెప్పారు. సర్వేకు వచ్చే సచివాలయ సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని కె.గోపాలపురం గ్రామంలో గురువారం చేపట్టిన ఉపాధి పనులను డ్వామా పీడీ వెంకటలక్ష్మి పరిశీలించారు. లబ్ధిదారు పందిరి మంగ పొలంలో చేపడుతున్న ఫారం పాండు పనులను పరిశీలించి, గట్టుపై కూరగాయల మొక్కలు పెంచకోవాలని సూచించారు. రైతులు అధిక మొత్తంలో ఫారం పాండ్లు, ట్రెంచ్ వర్కులు, హార్టికల్చర్ వర్కులు ప్రతిపాదించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఆర్.గంగాభవాని, ఇసి పి.రమేష్, సహాయకులు పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో రూ.30 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో 45,000 వేల వరకు సభ్యత్వం నమోదు అయిందన్నారు. సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తికి ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా రూపంలో రూ.5 లక్షలను పార్టీ అందజేస్తుందన్నారు. గతంలో రూ.2 లక్షలు ఉన్న బీమాను ప్రస్తుతం రూ.5 లక్షలకు పెంపుదల చేసినట్లు తెలిపారు.

ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో గురువారం ప్రతిభ విద్యా నికేతన్ 9వ తరగతి విద్యార్థులకు, వైఆర్ఎల్ఐటి కాన్సెప్ట్ స్కూల్ 9 వ తరగతి విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రంలో రసాయన సమీకరణాల చర్యలు పాఠ్యాంశానికి సంబంధించి విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు.

అంగన్‌వాడీలకు క్రీడాపోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సిడిపిఒ జి.ఉష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజేతలందరికీ ఈనెల 8వ తేదీన ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో బహుమతులు అందజేస్తామన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కాకినాడ
E.A.No. 193/2024, E.P.No. 34/2024, O.S.No. 556/2010
Between:
వల్లూరి జగన్నాయకులు ...పిటీషనర్/Dhr
మరియు
వాసంశెట్టి అప్పారావు, వగైరాలు ...రెస్పాండెంట్లు/JDR's
R_1 : వాసంశెట్టి అప్పారావు, S/o. అప్పారావు, డో.నెం.3-17-44,సింహాద్రి అపార్టుమెంట్స్, ఫస్ట్ ఫ్లోర్, రాధానగర్, అంభేద్కర్ గారి విగ్రహం ప్రక్కన, గొడారిగుంట,కాకినాడ.
R_2 : వాసంశెట్టి మహాలక్ష్మి, W/o. అప్పారావు, డో.నెం.3-17-44,సింహాద్రి అపార్టుమెంట్స్, ఫస్ట్ ఫ్లోర్, రాధానగర్, అంభేద్కర్ గారి విగ్రహం ప్రక్కన, గొడారిగుంట,కాకినాడ.
పై నెంబర్ ఎగ్జికుటివ్ అప్లికేషన్ E.A. No. 193/2024 లో మీరు 1 మరియు 2 రెస్పాండెంట్లు అయ్యివున్నారు. శ్రీ కోర్టు వారి నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబర్ E.A. No. 193/2024 పిటీషన్ ది. 25-3-2025 సం॥తేదిన వాయిదా అయ్యివున్నది. కావున పైన తెలిపిన కోర్టులో హాజరయ్యి ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై నెంబర్ పిటీషన్ తమ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచటమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367506, Cell: 9848314081

యానాం వార్తలు

కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లేబర్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ అమలు చేయవలసిన కనీస వేతనం తక్షణమే అమలు చేయాలని యానాం మిల్క్ బాయిలర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక జండా స్తంభం వద్ద జరుగుతున్న మిల్క్ బాయిలర్ ఆందోళన గురువారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అర్ధాని దినేష్, కాటంశేట్టి రామమ్మూర్తి తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 23 సంవత్సరాల నుంచి వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మిల్క్ బాయిలర్‌గా పనిచేస్తున్న వందలాదిమంది సిబ్బందికి రూ.10వేలు నుంచి రూ.18వేలు వేతనం పెంచుతానని ముఖ్యమంత్రి రంగస్వామి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిఒను విడుదల చేసి మిల్క్ బాయిలర్స్‌కు న్యాయం చేయాలని కోరారు.

కె.జంక్షన్‌కు వెంకన్న రథం తరలింపు

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు సందర్భంగా స్థానిక బస్టాండ్ ఆవరణలోని రథం షెడ్ నుంచి రథంను స్థానిక కె.జంక్షన్ సెంటర్‌కు తరలించారు. ఉత్సవదారులు, పోలీసులు ఆధ్వర్యంలో రథంను స్వామి వారి ఆలయం సమీపంలోని కె.జెంక్షన్ కు ట్రాక్టర్ సహాయంతో తరలించారు. ఈ నెల 13న స్వామివారి రథోత్సవం జరగనుంది.

జనసేన సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

పిఠాపురంలో ఈ నెల 14న జరుగునున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ పిలుపు ఇచ్చారు. గురువారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు శ్రేయోభిలాషులంతా సభకు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని, అభిమానులు తరలి వెళ్లేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారిచర్ల విజయశంకర్, మట్ట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీతానగరం విద్యార్థికి విసి అభినందన

ప్రజాశక్తి - సీతానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన నారీ ఫెస్ట్ పోటీల్లో సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్.లలిత పెయింటింగ్ విభాగంలో గెలుపొందినట్టు పాఠశాల హెచ్‌ఎం ఎం.వీరభద్రరావు తెలిపారు. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు హాజరయ్యారు. గెలుపొందిన లలితను జిల్లా కలెక్టర్ ప్రశాంతి, విసి ప్రసన్నశ్రీ ద్వారా మెమెంటో, సర్టిఫికెట్ ఇచ్చి అభినందించారు. లలితను కె.సతీష్ బాబు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ అభినందించారు.

ఫారం పాండ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కొత్తపల్లిలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారం పాండ్ పనులను గురువారం ఎపిఒ పిఎస్ అప్పలరాజు ఆధ్వర్యంలో డ్వామా పీడీ ఎ.నాగ మహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫారం పాండ్ పనుల చేపట్టిందని, ఈ పనుల వల్ల రైతులకు నీటి నిల్వలు ఉండి అవసరమైన సమయంలో నీటి ఎద్దడి లేకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. భూమిలోని నీటి నిల్వలు పెరిగి భూసారం పెరుగుతుందని, రైతులకు వివరించారు. మండలంలో మార్చి, ఏప్రిల్, మే నెలలకు గాను 260 ఫారం పాండ్ పనుల లక్ష్యంగా చేయాలని తెలిపారు. కంపోస్టులు ఫీట్ లు నిర్మాణం కూడా చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.గోవిందు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయరాదు

ప్రజాశక్తి-గోపాలపురం

చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయరాదని ఎంపిడిఒ బిఎస్ఎస్ శ్రీనివాస్ గ్రామస్తులకు సూచించారు. గురువారం స్థానిక ఉప్పరగూడెంలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు వేయరాదని, మురగునీరు, వెళ్లకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి, ప్రజలు వ్యాధులకు గురవుతారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యవంతంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ కార్యదర్శి అనురాధ, నీడ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ చాపల బాబూరావు పాల్గొన్నారు.

విద్యుత్ హైవోల్టేజ్‌తో ఇబ్బందులు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ స్టేషన్ సెంటర్ గల అన్న క్యాంటీన్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చిన సాంకేతిక లోపంతో జగ్గమ్మగారి పేట నుంచి మఠం సెంటర్ వరకు గురువారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ హైవోల్టేజ్ కారణంగా గృహాల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్‌లు కాలిపోయినట్టు స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గత 2 రోజులుగా వోల్టేజ్ విషయంలో తేడాలు గమనిస్తున్నామని, అయితే ఈరోజు సాయంత్రం ఒక్కసారిగా హై వోల్టేజ్ వచ్చి గహాల్లోని విద్యుత్ పరికరాలు ధ్వంసం అయ్యాయని ప్రజలు వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అమర్చిన ఎర్త్ బ్లేడు లోపం కారణంగా ఈ ఇబ్బంది ఏర్పడిందని, శుక్రవారం సమస్యను పరిష్కరించనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాటు

కరప : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫల, పుష్ప ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ తెలిపారు. గురువారం నడుకుదురు గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 8 తేదీన గోడారిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలకు, విభిన్న ప్రతిభావంతులైన మహిళా ఉద్యోగినులకు ఫల, పుష్ప ప్రదర్శనను చేస్తున్నట్లు తెలిపారు.

పబ్లిక్ నోటీసు
నా క్లయింటు తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, గాదాలమ్మ నగర్, డోర్ నెం. 88-3-5 కాపురస్తురాలు C.Radha Agrotech Private Limited, Managing Director అయిన చింతలపాటి వెంకట సత్య సూర్య రఘురామరాజు గారి భార్య చింతలపాటి రాధ గారు ఇచ్చిన సంజాయిషీపై యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా,
నా క్లయింటు తన స్వాధీనములో గల ఈ దిగువ ఉదహరించిన దస్తావేజులు తన దగ్గర ఉద్యోగం చేస్తున్న గొట్టుముక్కల సురేష్ కుమార్ రాజు గారికి ఇచ్చి జిరాక్స్ కాపీలు తీయించమని అప్పగించగా, అవి పెద్దాపురం మెయిన్‌రోడ్‌లో గల జిరాక్స్ షాపులో జిరాక్స్ కాపీలు తీయించుకొని వస్తుండగా ఒరిజినల్ దస్తావేజులు పడిపోయినవి. సదరు దస్తావేజులు ఎవరికైన దొరికిన ఎడల నాకు గాని, నా క్లయింటుకు గాని అప్పగించవలసినదిగా కోరుచున్నాను.
దస్తావేజు వివరములు:
1. ది. 01-12-2011 సం॥ తేదీన రాజమండ్రి శ్యామలానగర్ కాపురస్తులు బిక్కిన వీరాస్వామి, బిక్కిన ఉషారాణి నా క్లయింటు చింతలపాటి రాధ గారికి తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, డోర్ నెం. 88-3-5 కు సమీపంలో గల R.S. No. 365, 366, 367 లో గల ఫ్లాట్ నెంబరులు 29, 30 కు సంబంధించి వ్రాసిన రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ క్రియ దస్తావేజు నెం. 7034/2011.
2. ది. 23-5-1985 సం॥ తేదీన పై ఉదహరించిన ఆస్తికి సంబంధించి బిక్కిన వీరాస్వామి వగైరాలకు అంగిటిపల్లి సీతారామ రెడ్డి గారు రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో దస్తావేజు నెం. 4774/1985 గా వ్రాసి ఇచ్చిన క్రియ దస్తావేజు.
వేదుల సుబ్రహ్మణ్యం, అడ్వకేట్
పెద్దాపురం, సెల్: 9052699989